ఆంధ్రజ్యోతి **
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 6 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.145	215	244
సూర్యాపేట	రూ.155	220	250
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 24.2

ప్రైవేట్ భవనాల్లో ఇంకెన్నాళ్లు



నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



- కోట్ల రెవెన్యూ ఉన్నా సొంత భవనాలు కరువు
- ఉమ్మడి రాష్ట్రంలో కోదాడ, మోత్కూరు, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకే భవనాలు
- సౌకర్యాలు లేక దెబ్బతింటున్న డాక్యుమెంట్లు
- ఇది 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల దుస్థితి

ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఆయా కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏటా ప్రభుత్వానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లతో సుమారు రూ.300 నుంచి రూ.400 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయినా సొంత భవనాలు కరువయ్యాయి. - నల్లగొండ



అధికారులు పలుమార్లు నివేదికలు సమర్పించినా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన రాష్ట్ర శాఖ అధికారులు భవన నిర్మాణాల ఫైల్‌ను పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో సొంత భవనాలు కలగానే మిగిలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదనేది అర్థం కాని పరిస్థితి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని తెలుసుకొని, ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందని అధికారులను ఆరా తీశారు. వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎక్కడెక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా ఉన్నాయనేది అధికారులు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రైవేట్ కార్యాలయాల్లో సౌకర్యాలు కొరత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. దీంతో అరకొర సౌకర్యాలు నడుమనే అధికారులు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇక ఆస్తులు క్రయ విక్రయదారులకు సౌకర్యాలు ఉండటంలేదు. వాష్ రూమ్ సౌకర్యాలతో పాటు మంచినీటి సౌకర్యం లేకపోవడం ఫర్నిచర్ లేకపోవడం కూర్చోవడానికి కనీసం కుర్చీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ సంబంధించిన అధికారులు ఉన్న పరిస్థితులతోనే నెట్టుకుపోతున్నారు. ఇకపోతే కార్యాలయాల్లో పాత డాక్యుమెంట్లకు రక్షణ కరువైంది. గత 70 ఏళ్లకు పైగా పైబడి ఉన్న ఉర్దూ తెలుగు డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. గతంలో పాత డాక్యుమెంట్లను ఆన్‌లైన్ చేయిస్తామని అప్పటి ప్రభుత్వాలు చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. పాత డాక్యుమెంట్లు చినిగిపోయే పరిస్థితి ఉంది. ఎంతో విలువైన ఉర్దూ డాక్యుమెంట్లు ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ఉర్దూ డాక్యుమెంట్లను తెలుగులోకి అనువదించి వాటిని ఆన్‌లైన్‌లో భద్రపరచాలని గతంలో నిర్ణయించినా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వానికి రెవెన్యూ పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదనేది విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

నల్లగొండలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం కూడా త్వరలో సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. సొంత భవనం ఏర్పాటైతే ఆస్తుల క్రయవిక్రయదారులకు సౌకర్యాలు మెరుగుపడతాయి. ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన వెంటనే నల్లగొండలో సొంతభవనాన్ని నిర్మిస్తాం.

- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, నల్లగొండ.

ప్రభుత్వం దృష్టిలో ఉంది

గత ప్రభుత్వం హయాంలోనే జిల్లా అధికారులు సొంత భవనాలకు సంబంధించి నివేదికలు పంపించారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరలోనే నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. గతంలో కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయంలోకి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలని సూచించారు.

- ఎస్.ప్రకాష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్

ఉమ్మడి రాష్ట్రంలో మూడు కార్యాలయాలకే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేలా నిధులు కేటాయించారు. మొత్తం 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కోదాడ, మోత్కూరు, నకిరేకల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను రూ.64లక్షలతో సొంత భవనాలు నిర్మించారు. ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి హోంమంత్రి, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మహమూద్ అలీకి కూడా నివేదికలు సమర్పించినప్పటికీ నిధులు మంజూరుకాలేదు. ఆయన కొన్నినెలల క్రితం గత ప్రభుత్వ హయాంలో నల్లగొండలో పర్యటన సందర్భంగా కూడా భవన నిర్మాణాల గురించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి కార్యాలయాలు తరలించాలని చెప్పడమే తప్ప సొంత భవనాల నిర్మాణాల కోసం నిర్ణయం తీసుకోలేదు. నల్లగొండ విషయానికి వస్తే కలెక్టరేట్‌లో కొన్ని కార్యాలయాలు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. ఆ భవనాల్లోకి కేవలం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్నే తరలించేందుకు వీలుంటుంది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కేవలం అడ్మినిస్ట్రేషన్‌కే పరిమితమైతే తరలించవచ్చు. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రజలతో అనుబంధంగా ఉంటున్నందున తరలించేందుకు వీలుపడటం లేదు.

గొర్రెల స్కాంలో అధికారులకు బిగుస్తున్న ఉచ్చు



- ఇప్పటికే చంచల్‌గూడ జైలులో వయోజన విద్య డీడీ
- డిప్యూటేషన్‌పై వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసిన అధికారులు
- ఏసీబీ విచారణలో పలు విషయాలు వెలుగులోకి
- కలెక్టరేట్‌లో ఫైళ్ల క్లియరెన్స్ ఇక కష్టతరమే

నల్లగొండ, మార్చి 5: గొర్రెల స్కాంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో పాటు జిల్లా పశుసంవర్థక శాఖలో పాత్రధారులైన అధికారులకు ఉచ్చు బిగుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపు విషయంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ, నల్లగొండలో మాత్రం అందుకు విరుద్ధంగా దళారుల నుంచి పెద్ద మొత్తంలో యూనిట్లను కొనుగోలు చేసిన అధికారులు చిక్కుల్లో పడ్డారు. రాష్ట్రస్థాయిలో ఒక కీలకమైన ప్రజాప్రతినిధితో పాటు ఓ ఉన్నతాధికారి సూచనతో ఈ అవినీతికి తెరతీసినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన నలుగురు అధికారుల్లో నల్లగొండ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్ కూడా ఉన్నారు. అరెస్టు తరువాత ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడమే గాక, ఆయన స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన ఓ అధికారికి డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు వయోజన విద్యలో కీలకమైన సెక్షన్ పనులను నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతికి కేటాయించారు. ఇక ఏసీబీ అధికారులు మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించగా, నల్లగొండకు చెందిన వయోజన విద్య అధికారి గణేష్ పలు కీలకమైన అంశాలు ఏసీబీ అధికారులకు చెప్పినట్టు వినికిడి. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులపైనా విచారణ?

గత ప్రభుత్వం గొర్రెల కొనుగోళ్ల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు పశుసంవర్థక శాఖ అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులకు సైతం బాధ్యతలు అప్పగించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని వివిధ కీలకమైన శాఖలకు చెందిన ఉన్నతాధికారులు గొర్రెల కొనుగోళ్లలో ప్రధాన పాత్ర పోషించారు. అందులో పలువురు దళారుల వద్దే గొర్రెలను సేకరించే విషయంలో ఉత్సాహం చూపినట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 1,066 యూనిట్ల ఫైలు ప్రకారం సుమారు రూ.15కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో రూ.12కోట్ల మేర దళారులకే చెల్లించాల్సి రావడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయాన్ని అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ కర్ణన్ పరిశీలించి ఫైల్‌ను పక్కన పెట్టారు. అదేవిధంగా ప్రస్తుత కలెక్టర్ హరిచందన సైతం ఫైల్‌ను స్టడీ చేయాల్సి ఉందని పశుసంవర్థకశాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఆ ఫైల్‌తోపాటు జరిగిన పొరపాట్లను, అక్రమాలను, అవినీతిని గ్రహించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇక ఆ ఫైల్‌కు మోక్షం కలిగే ప్రసక్తి లేదని పశుసంవర్థక శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. వారిని కూడా త్వరలోనే ఏసీబీ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. వారందరినీ విచారిస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫైల్ పెండింగ్ విషయంపై పశుసంవర్థకశాఖ జేడీ సుబ్బారావును పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఫైల్ కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లో ఉందని స్పష్టం చేస్తున్నారు. అయితే ఆ ఫైల్‌లో ఉన్న అంశాల గురించి మాత్రం తనకు తెలియదని చెబుతున్నారు. ప్రధానంగా నల్లగొండ జిల్లాలో 1,172 నకిలీ ఇన్‌వాయిస్‌లకు చెల్లింపులు చేసినట్టు కాగ్ నివేదికలో వెల్లడించింది. మొత్తానికి వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్ అరెస్ట్ కావడం జైలుకు వెళ్లడంతో పాటు ఇటీవల ఏసీబీ అధికారుల కస్టడీలో ఎలాంటి విషయం వెల్లడించారనే దానిపై జిల్లా అధికారుల్లో భయాందోళన మొదలైంది.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకట్రావ్, ఇతర అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్ఏఎం రిజ్వీ

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 5: జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మండలాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా పరిశీలన చేయాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలపై లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దరఖాస్తుదారులు చేసుకున్న దరఖాస్తుల్లో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు లింకేజీ, గ్యాస్ వినియోగదారులు, సెల్‌ఫోన్ వివరాలు తప్పక ఉండేలా చూడాలన్నారు. దరఖాస్తుల పరిశీలనతో అర్హులైన వారికి అన్యాయం కాకుండా ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకట్రావ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎంపీడీవో, మునిసిపాలిటీల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో అప్పారావు, డీఎస్‌వో మోహన్‌బాబు, డీఏవో శ్రీధర్ రెడ్డి, సీపీవో కిషన్, డీటీడీవో శంకర్, డీడబ్ల్యూవో డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

త్వరలో జిల్లాలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గతంలో 80ఏళ్లు నిండిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించామన్నారు. కానీ ఇప్పుడు 85ఏళ్లు పైబడిన వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉందని, అర్హులైన వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు మౌనిక, శ్రీహర్షిత, శ్రీధర్‌లకు నగదు బహుమతులు అందజేసి మాట్లాడారు. వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం బాపూజీ, డీఈవో అశోక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శంకర్‌నాయక్, శంకర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

దోరకుంటలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కోదాడ రూరల్, మార్చి 5: మండలంలోని దోరకుంట గ్రామంలో తాగునీటి కష్టాలు తీవ్రస్థాయికి చేరాయి. తాగునీటి కష్టాలు తీర్చాలని మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. గ్రామంలోని హరిజనవాడలో సరైన నీటి సరఫరా లేక కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ ట్యాంకర్ ఉన్నా, ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రాధాన్యం ఇవ్వకుండా గ్రామంలో చేపట్టే సీసీరోడ్లు, డ్రైనేజీలు వంటి పనులకు వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యే పద్మావతి పట్టించుకొని గ్రామంలో తాగునీటి ఇక్కట్లు తీర్చాలని మహిళలు వేడుకుంటున్నారు.

మార్కెట్ ఫీజు రూ.27కోట్లు విడుదల

- ఐకేపీ, పీఏసీస్ కేంద్రాలను నుంచి ఒక్కశాతం పన్ను రూపంలో
- సివిల్ సప్లయ్ నుంచి మార్కెటింగ్ శాఖకు నిధులు విడుదల
- రెండేళ్ల మార్కెట్ ఫీజు బకాయిలు విడుదల
- అత్యధికంగా పేటమార్కెట్‌కు రూ.11కోట్లు



సూర్యాపేట సిటీ, మార్చి 5: జిల్లాలో 2020-21,2021-22 రెండు సీజన్లలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులనుంచి ధాన్యం కొనుగోలుచేశారు. తాజాగా ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల నుంచి ఆయా వ్యవసాయ మార్కెట్లకు రావాల్సిన ఒక్కశాతం పన్ను(సెస్)ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా సివిల్ సప్లయి శాఖనుంచి మార్కెటింగ్ శాఖకు విడుదల చేసిందని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కేఎన్‌శర్మ తెలిపారు. జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్లకు కలిపి ఒక్కశాతం పన్ను రూపంలో రూ.27,92,80,222 విడుదల చేసిందని తెలిపారు. మార్కెట్లకు సెస్ రూపంలో వచ్చిన నిధులను ఆయా వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

మార్కెట్లకు మహర్దశ

ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలనుంచి మార్కెట్లకు వచ్చిన ఒక్కశాతం పన్నుతో జిల్లాలో ఉన్న ఆరు వ్యవసాయ మార్కెట్లలో నిధులు లేక నిలిచిన పనులకు మహర్దశ పట్టనుంది. వ్యవసాయ మార్కెట్ల ఆధునికీకరణ, నూతన భవనాల నిర్మాణం, మార్కెట్లలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాట్లు, సంతలో మౌలిక వసతుల కల్పన, తదితర పనులకు ఈ నిధులను ఉపయోగించనున్నారు.

మార్కెట్ ఫీజు రూ.27కోట్లు విడుదల

ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా ఆయా పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ఆదాయంలో ఆయా వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ నిర్వాహకులు వ్యవసాయ మార్కెట్లకు ఒక్కశాతం పన్ను (సెస్) చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా ఒక్కశాతం పన్ను చెల్లింపులు చేస్తే, వ్యవసాయ మార్కెట్ల అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన టార్పాలిన్లు, ధాన్యం జల్లడపట్టే యంత్రాలను సరఫరా చేస్తుంది. కొనుగోలు కేంద్రాలు ధాన్యం సేకరణ పూర్తయిన తర్వాత మళ్లీ వాటిని వ్యవసాయ మార్కెట్లకు అందజేస్తారు. వీటితోపాటు ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మార్కెట్లనుంచి మార్కెట్ రశీదులను తీసుకెళ్తుంటారు. ఆ విధంగా సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, తిరుమలగిరి, నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్లకు ప్రభుత్వం పన్ను బకాయి రూ.27,92,80,222 విడుదల చేసింది. అత్యధికంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు రూ. 11 కోట్లు రాగా, అత్యల్పంగా నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్‌కు రూ.42 లక్షలు పన్నుల రూపంలో ఆదాయం వచ్చింది.

పెండింగ్‌లో రూ.10కోట్లు

2023 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఇంకా రూ. 10కోట్లపైగా మార్కెట్ ఫీజు రావాల్సి ఉందని మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొన్నారు. 2020 నుంచి 2022 వరకు పెండింగ్‌లో ఉన్న మార్కెట్ ఫీజు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని, 2023 ఖరీఫ్, రబీ సీజన్లకు చెందిన మార్కెట్ ఫీజు బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మార్కెట్ల అభివృద్ధికి నిధులను ఖర్చు చేయాలి

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు సెస్ రూపంలో వచ్చిన నిధులను ఆయా వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ఖర్చు చేయాలి. నిధులు లేక పెండింగ్‌లో మిగిలిన అభివృద్ధి పనులకు ఆ నిధులను ఖర్చు చేయాలి. పన్నుల రూపంలో వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకొని మార్కెట్ల అభివృద్ధికి ఆయా మార్కెట్ల కార్యదర్శులు కృషి చేయాలి.

- కేఎన్.శర్మ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి.

వ్యవసాయ మార్కెట్	విడుదలైన పన్ను
సూర్యాపేట	రూ.11,20,96,624
హుజూర్‌నగర్	రూ.3,08,47,022
కోదాడ	రూ.4,66,00,716
తుంగతుర్తి	రూ.3,86,11,805
తిరుమలగిరి	రూ.4,68,98,636
నేరుడుచర్ల	రూ.42,25,149

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి పారువేట

అర్వపల్లి, మార్చి 5: అర్వపల్లి యోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పారువేట వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి లక్ష్మీనర్సింహస్వామి పారువేట బయల్దేరారు. స్వామి వేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వేలాది మంది మంగళహారతులు, కొబ్బరికాయలు సమర్పించారు. భద్రాచలంకు చెందిన కళాకారుల గుస్సాడి నృత్యం ఆకట్టుకుంది. స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి వేషాధారణలతో దర్శనమిచ్చారు. ఒగ్గు కళాకారులు ప్రత్యేక నృత్యాలు చేయడంతో భక్తులు తిలకించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచార్యులు, ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అర్చకులు రాంబాబు, పవన్, సామ అభిషేక్‌రెడ్డి, మోరపాక సత్యం, మారోజు బ్రహ్మాచారి, రత్నం లక్ష్మాజీ, జేర్రిపోతుల సోమయ్య, కనుకు రేణుక, బైరబోయిన మహారాజు, అవిలయ్య, శేఖర్, నర్సింగ్ శ్రీనివాస గౌడ్, నసీర్‌గౌడ్, దిర్శనం కృష్ణమూర్తి, కోటిప్రసాద్ పాల్గొన్నారు.



లక్ష్మీనర్సింహస్వామికి పారువేట ఊరేగింపు



ముగిసిన కబడ్డీ క్రీడలు

అర్వపల్లి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ప్రథమ బహుమతి వీవైసీ నూతనకల్ రూ.30వేలు, ద్వితీయ బహుమతి మోత్కూరు రూ.25వేలు, తృతీయ బహుమతి జాజిరెడ్డిగూడెం రూ.20వేలు, చతుర్థ బహుమతి వరంగల్ రూ.15వేలు, పంచమ బహుమతి గొట్టిపర్తి రూ.10వేలు గెలుచుకున్నాయి. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రైడర్లు,క్యాచర్లకు బహుమతులను యోగానందచార్యులు అందజేశారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

అదనపు కలెక్టర్ డీఎస్ లత

మేళ్లచెర్వు, మార్చి 5: జాతర ముగిసే వరకూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ డీఎస్ లత అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకోసం ఏర్పాట్లు చేసిన పార్కింగ్, ఎడ్ల పందేల మైదానం, ఆలయ పరిసరాలు, ఆలయ క్యూలైన్లను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయం వద్ద పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించి, ఏ రోజు సేకరించిన చెత్తను అదేరోజు తీసివేసి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, 24 గంటలు అన్ని శాఖల అధికారులు, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈవో కొండారెడ్డి, డీఎంహెచ్‌వో కోటాచలం, డీఆర్‌డీవో పీడీ మధుసుదనరాజు, డీపీవో సురేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటయ్య, సీఐ రంజితారెడ్డి, ఎస్ఐ పరమేష్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో అఫ్జర్ అలీ, సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ లత

సీఎం రేవంత్‌రెడ్డికి గుడి

● అభిమానం చాటుకున్న వీరాభిమాని సంతోష్

● ఈ నెల 19న నల్లగొండ జిల్లా వనిపాకలలో భూమిపూజ

చిట్యాలరూరల్, మార్చి 5: తమకు నచ్చిన నాయకులపై ఏదో ఒక రకంగా అభిమానం చాటుకుంటుంటారు అభిమానులు. వారిని దేవుడిలా కొలుస్తుంటారు. అదే కోవకు చెందిన ఓ వీరాభిమాని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి గుడి కట్టించాలని నిర్ణయించుకున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన మేడి సంతోష్ సీఎం రేవంత్‌రెడ్డికి వీరాభిమాని. రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల్లో ఉన్నప్పటి నుంచీ ఆయనపై సంతోష్ ఎంతో అభిమానం పెంచుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి చేరడంతో ఆ అభిమానం మరింత పెరిగింది. రియల్ ఎస్టేట్ చేసే ఆయన తాను నివాసం ఉంటున్న ఇంటి ఎదుట సొంత స్థలంలో సీఎం రేవంత్‌రెడ్డికి గుడి కట్టాలని మంగళవారం నిర్ణయించుకున్నాడు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ సందర్భంగా సంతోష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అంటే తనకు చాలాకాలంగా ఎంతో అభిమానమన్నారు. కనిపించని దేవుడి కంటే కనిపించే దేవుడిలా భావిస్తూ ప్రజల కోరికలు తీర్చుతున్నారని కొనియాడారు. ప్రజల కష్టాలను తెలుసుకుని వాటిని తీర్చేందుకు శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతోనే ఆరు గ్యారెంటీల్లో ప్రమాణస్వీకారం చేపట్టగానే రెండింటిని అమలు చేశారని, ఈ మధ్యనే మరో రెండింటిని అమలు చేసి నాలుగు గ్యారెంటీలను ప్రజలకు కానుకగా ఇచ్చారన్నారు. రేవంత్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయన్ను దేవుడిలా కొలుస్తూ గుడిని నిర్మించనున్నానని అందుకు ఈ నెల 19వ తేదీన గుడి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డిపై తనకున్న అభిమానంతో ఆయన్ను దేవుడిలా కొలుస్తూ గుడిని నిర్మించేందుకు నిర్ణయించుకున్నానని, ఈ అవకాశం తనకే దక్కడం ఆనందంగా ఉందని సంతోష్ తెలిపాడు. సంతోష్ తండ్రి మేడి యాదయ్య కాంగ్రెస్ పార్టీ నాయకుడు. ఆయన్ను స్థానికంగా 'ఎమ్మెల్యే యాదయ్య' అని పిలుస్తుంటారు.



వనిపాకలలో సీఎంకు గుడి నిర్మాణం చేసే స్థలాన్ని చూపుతున్న మేడి సంతోష్

'మహా'జాతరకు సర్వంసిద్ధం

● రేపు సాయంత్రం నుంచి జాతర ప్రారంభం ● పూర్తయిన ఏర్పాట్లు ● ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు
● ఎద్దుల పోటీలకు ముమ్మర ఏర్పాట్లు ● ఆకట్టుకోనున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు



వేడుకలకు సిద్ధమైన శంభులింగేశ్వరస్వామి ఆలయం

మేళ్లచెర్వు, మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత, స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి జాతర ఈ నెల 8వ తేదీ (గురువారం) సాయంత్రం నుంచి ప్రారంభమవుతుంది. గతేడాది ఈ జాతరకు సుమారు ఐదు లక్షల మంది హాజరు కాగా... ఈ సారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి వసతి, ప్రత్యేక వైద్య శిబిరాలు, బారీ కేడ్లు, పార్కింగ్ స్థలాలు, క్రీడా ప్రాంగణాలు అన్ని పూర్తిచేసి, సుమారు 700 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

ఆలయ విశిష్టత

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ఈ ఆలయం అనేక విశేషాలతో కూడుకొని ఉన్నది. మహిమ గల దేవుడిగా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కొలవబడే స్వామి వారు లింగం ఆకారంలో ఉన్నారు. శివలింగం పైన రెండు వేళ్ల పట్టేంత స్థలం నుంచి గంగాజలం నిత్యం వస్తుండడం, ఎన్నిసార్లు తోడినా నీరు వస్తుండడం విశేషం. ప్రతీ 12 సంవత్సరాలకు ఒకసారి లింగం ఆకారం ఒక అంగుళం చొప్పున పెరగటం మరో విశిష్టత. అత్యంత ప్రాచీన ఆలయంగా కాకతీయుల కాలంలో 1311లో ఈ ఆలయం నిర్మించినట్లు ఆలయ ప్రాంగణంలో ఉన్న శిలాశాసనంపై లిఖించి ఉంది. సంతానంలేని దంపతులు స్వామి వారి ఆలయంలో స్థానసారం దీక్ష చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రతీ మహాశివరాత్రి రోజున స్వామి వారికి ఇష్టకామేశ్వరి అమ్మవారికి అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించటం, జాతర చేయటం ఇక్కడ ఆనవాయితీ.

ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు

మహా శివరాత్రి జాతరలో శివరాత్రి రోజున, ఆలయ ప్రాంగణంలో శివరాత్రికి ముందు రోజున గ్రామ కూడలిలలో నిర్మించే 100నుంచి 110 అడుగుల ఎత్తులో నిర్మించే విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో కోటప్పకొండ తర్వాత అంత ప్రాముఖ్యం ఈ జాతరకు ఉంది. ఈ ప్రభలను వాటి మీద ఏర్పాటుచేసే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలతోపాటుగా ఆంధ్ర ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన ఎద్దుల పందేలు ఇక్కడ నిర్వహిస్తారు. ఎనిమిది విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో 80 బహుమతులు ప్రదానం చేస్తారు. ఆలయ ప్రాంగణంలో జాతర సందర్భంగా ఇన్విటేషన్ టీంలతో ఏర్పాటుచేసే కబడ్డీ పోటీలు ఆకట్టుకునే విధంగా ఉంటాయి. జాతర ఐదు రోజులు రాత్రివేళల్లో సాంఘిక, పౌరాణిక నాటకాలతో పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్న కోలాటాలు నిర్వహిస్తుంటారు.



సిద్ధమైన ప్రభలు

అన్నదానానికి ఏర్పాట్లు

మహాశివరాత్రి జాతర ఐదు రోజులపాటు ఆలయ సమీపంలోనే టీటీడీ కల్యాణ మండపం ఆధ్వర్యంలో అన్నదానానికి ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తుండగా... దాతల సహకారంతో వీరబ్రహ్మ మఠం తరఫున దండా లింగయ్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కాగా... గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల ముందు మహాశివరాత్రి జాతరరావటంతో ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న వారు పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా.. ఈసంవత్సరం దాతలు ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం తరఫున ఏర్పాటుచేస్తున్నారు.

రెండేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యం

● పునఃప్రారంభమైన ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పనులు ● పనులను తరచూ పర్యవేక్షిస్తున్న అధికారులు ● ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు సహకరించాలి : ఎమ్మెల్యే బాలూనాయక్



గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను పర్యవేక్షిస్తున్న డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటేశ్వరరావు, అధికారులు, గొట్టిముక్కల రిజర్వాయర్

దేవరకొండ, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, బడ్జెట్‌లో ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించడంతో ప్రాజెక్టుల నిర్మాణ పనులు పునప్రారంభమయ్యాయి. గత ఆరు నెలలుగా నిధుల కొరత, కోర్టు కేసులు, వివిధ కారణాలతో నిలిచిపోయిన ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చెబుతున్నారు. అందుకుగాను అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించి సమీక్షిస్తుండడంతో ప్రాజెక్టుల పనులు పునః ప్రారంభమయ్యాయి. శ్రీశైలం సొరంగమార్గం.. శ్రీశైలం నుంచి తవ్వకం పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలుపుతున్నారు. నల్లగొండ జిల్లాలోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టును ప్రారంభించారు. రూ.1925కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 2005లో శ్రీశైలం సొరంగమార్గాన్ని ప్రారంభించారు. కాగా పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా అంచనా వ్యయం ఇప్పటికే రూ.4,618 కోట్లకు పెరిగింది. సొరంగమార్గం మొత్తం 43.93 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 34.37 కిలోమీటర్లు పూర్తయింది. 9.559 కి.మీ.ల సొరంగం తవ్వితే ప్రాజెక్టు పూర్తవుతుంది. రూ.2500 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయి. 2026 జూన్ వరకు గడువు పొడిగించారు. టన్నెల్ బేరింగ్ మిషన్ మరమ్మతులకు గురికావడంతో జర్మనీ, అమెరికా దేశాల నుంచి పరికరాలను తెప్పించే పనిలో నిమగ్నమయ్యారు. మన్నెవారిపల్లి ఒకటో టన్నెల్ వద్ద పనులు నిలిచిపోగా శ్రీశైలం నుంచి సొరంగం తవ్వకం పనులను పునఃప్రారంభించినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలుపుతున్నారు.

కొనసాగుతున్న డిండి ఎత్తిపోతల పనులు

డిండి ఎత్తిపోతల పథకాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపనచేసి రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకుగాను ప్రాజెక్టు వ్యయం రూ.6190కోట్లు కేటాయించారు. కాని భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో భూనిర్వాసితులు ప్రాజెక్టు పనులను అడ్డుకోవడంతో తరచూ పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతోపాటు ప్రాజెక్టులకు అనుమతిలేదని, కోర్టులో కేసుతో పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమయ్యాయి. డిండి ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తిచేస్తామని మంత్రులు, అధికారులు చెబుతున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో శివన్నగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, ఉల్పర, గోకారం, ఇర్విన్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. వీటిలో గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్ల పనులు 95శాతం పూర్తయ్యాయి. చర్లగూడెం రిజర్వాయర్ పనులు 65శాతం పూర్తయ్యాయి. చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల పనులు 35శాతం పూర్తయ్యాయి. మిగతా రిజర్వాయర్ల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో 200 ఎకరాలకు భూపరిహారం చెల్లించాల్సి ఉంది. అందులో 130 ఎకరాలవరకు ప్రభుత్వ భూమి ఉంది. గొట్టిముక్కల, పూతల్‌రాంతండా, లింగన్నబావి భూనిర్వాసితులకు చింతపల్లి వద్ద పునరావాసం కల్పించారు. వెంకేపల్లి తండా, చర్లగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి ముంపు ప్రజలకు పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురవుతున్న ఎనిమిది గ్రామాల భూనిర్వాసితులకు పునరావాసం కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎస్ఎల్‌బీసీకి రూ.2వేల కోట్లు, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.800 కోట్లు కేటాయించి రెండున్నరేళ్లలో పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో కొనసాగుతున్న ప్రొటెక్షన్‌వాల్ (రక్షణగోడ), విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పనులు, జనరేటర్, కార్యాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటేశ్వరరావు తెలిపారు. చర్లగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షించారు. దీంతో ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

పనులు కొనసాగుతున్నాయి

డిండి ఎత్తిపోతల రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయి. భూనిర్వాసితులందరికీ పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల నిర్మాణానికి అందరు సహకరించాలి. ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది.

వెంకటేశ్వరరావు, ఎస్ఈ

సాగునీరు అందించడమే లక్ష్యం



డిండి ఎత్తిపోతల, నక్కలగండి, శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టులను పూర్తిచేసి నియోజకవర్గానికి సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టి సారించారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి ముందుకెళుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు సహకరించాలి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

నేనావత్ బాలూనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

బాలికల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరపాలి

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భువనగిరి హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు బాలికల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌వద్ద ధర్నా చేయడానికి ప్రయత్నించగా వారికి అనుమతిలేదంటూ దోమలగూడ పోలీసులు ధర్నాను అడ్డుకున్నారు. బాదితుల కుటుంబసభ్యులు లలిత, వివిధ ప్రజాసంఘాల నాయకురాళ్లు మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఈ ఘటనపై న్యాయవిచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ధర్నా చేయడానికి వచ్చారు. 11గంటల సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు ఎలాంటి అనుమతులులేవని తేల్చిచెప్పారు. దీంతో న్యాయపోరాట కమిటీ నేతలు, బాధితుల కుటుంబసభ్యులు ఖచ్చితంగా ధర్నాచేసి తీరుతామని, తమ పిల్లలది ఆత్మహత్యకాదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదంటూ రోడ్డుపై నిరసన తెలిపారు. వెంటనే దోమలగూడ పోలీసులు వారికి సర్దిచెప్పి 'మీకు అన్యాయం జరిగితే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలి' అని సలహా ఇవ్వడంతో వారు అక్కడినుంచి వెళ్లారు. ఈ ధర్నాకుమద్దతు తెలియజేయడానికి వచ్చిన పీఓడబ్ల్యూనేతలు సంధ్య, ఝాన్సీ, చైతన్య, మహిళా సంఘం నాయకురాళ్లు పి.జ్యోతి తదితరులు మాట్లాడుతూ వైష్ణవి, భవ్యల ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేసి వారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలన్నారు.



విద్యార్థినుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

ఎయిమ్స్‌లో రక్తహీనతపై పరిశోధన

● ఏప్రిల్‌లో పరిశోధనలు ప్రారంభం : డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, మార్చి5: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో రక్తహీనతపై పరిశోధనలు చేయనున్నారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), ఆయుర్వేద సైన్స్ సహకారంతో అనేమియా(రక్తహీనత)పై బీబీనగర్ ఎయిమ్స్‌తోపాటు వార్ధ, జోద్‌పూర్, బెంగళూర్, రాంచీ, న్యూఢిల్లీ, భూపాల్‌లోనూ అధ్యయనం చేయనున్నట్లు ఆదివారం ఢిల్లీలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశంలో రక్తహీనత ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారిందని 2019-2021లో జాతీయ కుటుంబ సర్వేలో తేలింది. దాదాపు 57శాతం మంది 15నుంచి 49సంవత్సరాల వయసు గల మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో భారత ప్రభుత్వం రక్తహీనత సమస్యను ప్రాధాన్య అంశంగా తీసుకుని పరిశోధనకు నిర్ణయించింది. బీబీనగర్ ఎయిమ్స్‌లో కమ్యూనిటీ మెడిసిన్, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో సంబంధిత విభాగ అధిపతి ఆర్.గోమతి నాయకత్వంలో పరిశోధనలు ప్రారంభం కానున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు.



బీబీనగర్ పరిధిలోని ఎయిమ్స్

ఆపరేటర్లకు అందని భత్యం



కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ(ఫైల్)

భువనగిరి టౌన్, మార్చి 5: కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటివరకు నాలుగు పథకాలను ప్రభుత్వం అమలుచేసింది. ఇందుకోసం 28 డిసెంబరు 2023 నుంచి 6 జనవరి 2024 వరకు రాష్ట్రమంతటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలనలో ఆశావహులనుంచి దరఖాస్తులను స్వీకరించింది. స్వీకరించిన దరఖాస్తులను గత నెల 7 నుంచి 17 వరకు ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రజాపాలన తెలంగాణ పోర్టల్‌లో నమోదు చేశారు. వడపోతల అనంతరం ఎంపికైన అర్హులు పథకాల లబ్ధిని పొందుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం ఇంతవరకు ఇస్తానన్న చార్జీలను మాత్రం ఇవ్వలేదు. దీంతో ఉమ్మడిజిల్లాలో ప్రజా పాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లు ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతున్నారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యే వరకూ వెంటే ఉంటూ ఒత్తిడి చేస్తూ పని చేయించుకున్న అధికారులు అనంతరం మొఖం చాటేస్తుండడం, తాము ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల ఆధారంగానే ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి తన హామీలను నెరవేర్చుకుంటూ తమను విస్మరిస్తుండడం పట్ల ఆపరేటర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 11,41,767 ప్రజాపాలన దరఖాస్తులను ఎంట్రీ చేసిన సుమారు 6వేల మంది ఆపరేటర్లకు రూ.57,08,835 చార్జీల రూపంలో అందాల్సి ఉంది.

ఒత్తిడితోనే పని పూర్తి

సుమారు వారం పని దినాల్లో ప్రతీ బస్తీ, ప్రతీ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో స్వీకరించిన అర్జీలను సంబంధిత ప్రభుత్వ సిబ్బందే ఎంట్రీ చేయాలని మొదటగా ఉన్నతాధికారులు నిబంధన విధించారు. కానీ పలువురికి కంప్యూటర్ అవగాహన కొరవడడం మరికొందరికి కంప్యూటర్లు లేకపోవడం మరికొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య ఉండడంతో ప్రైవేట్ ఆపరేటర్లచే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు ప్రతీ దరఖాస్తుకు రూ.15ఇస్తామని మొదటగా ప్రకటించారు. అనంతరం రూ.10తగ్గించి రూ.5మాత్రమే ఇస్తామన్నారు. అయినప్పటికీ ప్రైవేట్ ఆపరేటర్లు ప్రజాపాలనలో తాము భాగస్వాములు కావాలనే ఉత్సాహంతో దరఖాస్తులను ఎంట్రీచేశారు. ఎంట్రీ ప్రక్రియ కొనసాగినన్ని రోజులు అధికారులు ప్రతీ నిమిషం పర్యవేక్షిస్తూ టార్గెట్ పూర్తి చేయాలంటూ ఒత్తిడిచేస్తూ గడువులోపు ఎంట్రీలను పూర్తి చేయించారు. చివరి రోజు నాటికి చార్జీలను చెల్లిస్తామని ప్రతీరోజు పేర్కొనే వారు కానీ ఎంట్రీ ప్రక్రియ పూర్తయి సుమారు 50 రోజులు గడుస్తుండగా ప్రైవేట్ ఆపరేటర్ల ఎంట్రీల ఆధారంగానే అర్హులను ఎంపికచేసి అభయ హస్తం పథకాల లబ్ధిని కూడా ప్రభుత్వం అందిస్తున్నది. ప్రతీ పథకం ప్రారంభానికి ముందు పాలకులు, అధికారులు హంగామా చేస్తూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన చార్జీలను మాత్రం విస్మరిస్తుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

యువతే అధికం

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లలో యువతే అధికంగా ఉంది. ప్రభుత్వ కార్యాకలాపాల్లో విధులు నిర్వహించాలనే ఉత్సాహంతో పలువురు యువకులు సొంత కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల ద్వారా ఎంట్రీ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ రెండు లేని వారు తమకు తెలిసిన వారి వద్ద నుంచి తాత్కాలికంగా సర్దుబాటు చేసుకున్నారు. మరికొంత మంది గృహిణులు ఇంట్లో ఉంటూనే ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఇంటర్నెట్ సౌకర్యంలేని వారు తాత్కాలికంగా సెల్‌ఫోన్లలో నెట్ బ్యాలెన్స్ రీచార్జ్ చేసుకోగా మరికొందరు వైఫై అందుబాటులో ఉన్న బంధువుల ఇళ్ల నుంచి కూడా దరఖాస్తులను ఎంట్రీచేశారు. ఒక్కో దరఖాస్తుకు సంబంధించి సుమారు 25 వివరాలను సుమారు 10 నిమిషాలపాటు ఎంట్రీ చేసినప్పటికీ వారికి రావాల్సిన స్వల్ప చార్జీలు కూడా నేటికీ అందలేదు.

ప్రజాపాలన దరఖాస్తులు ఇలా

జిల్లా	దరఖాస్తులు	ఆపరేటర్లకు రావాల్సిన చార్జీలు
నల్లగొండ	6,11,853	రూ.30,59,265
సూర్యాపేట	3,11,107	రూ.15,55,535
భువనగిరి	2,18,507	రూ.10,94,035
మొత్తం	**11,41,767**	**రూ.57,08,835**


చార్జీలను వెంటనే చెల్లించాలి



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ ఆపరేటర్లకు వెంటనే చార్జీలను చెల్లించాలి. మామిత్ర బృందం సుమారు 600లకు పైగా దరఖాస్తులను ప్రజాపాలన తెలంగాణ పోర్టల్‌లో నమోదు చేశాం. చార్జీల రూపంలో వచ్చే మొత్తంతో చిన్నపాటి అవసరాలు తీరుతాయనుకున్నాం. కానీ ఇప్పటివరకు అధికారులు, ప్రభుత్వం చార్జీల చెల్లింపుపై మౌనం పాటిస్తుండడం ఆశ్చర్యంగా ఉంది. ఆపరేటర్లందరూ నిరుద్యోగులు, గృహిణులే అధికంగా ఉన్నారు. ఇప్పటికైనా చార్జీలను చెల్లించాలి.

జాలిగం శివప్రసాద్, ప్రైవేట్ ఆపరేటర్, భువనగిరి

నిధులు రాగానే చార్జీలు చెల్లిస్తాం



భూదాన్‌పోచంపల్లి మండలంలో 11,358 ప్రజాపాలన దరఖాస్తులను ఆపరేటర్లు ఎంట్రీ చేశారు. కానీ వారికివ్వాల్సిన చార్జీలను ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయలేదు. చార్జీల కోసం ఆపరేటర్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే చార్జీలను చెల్లిస్తాం. దరఖాస్తులను ఆపరేటర్లు నిర్ధేశిత గడువులోపు నమోదు చేయడంతోనే అర్హుల ఎంపిక సులువైంది.

రాపర్తి భాస్కర్, పోచంపల్లి ఎంపీడీవో.

నిద్రపోదామంటే క్రికెట్ గోల

● నివాసల మధ్యే బాక్స్ క్రికెట్ ● అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న ఆటలు ● అరుపులు, కేకలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సూర్యాపేట టౌన్, మార్చి 5: జిల్లా కేంద్రంలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌తో చుట్టుపక్కల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి వరకు బాక్స్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అరుపులు, కేకలతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను తొలగించాలని చుట్టుపక్కల కాలనీవాసులు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. జిల్లా కేంద్రంలోని 18వ వార్డు సుందరయ్య నగర్‌లో ఇటీవల బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేశారు. చుట్టూ ఉన్న పేదలు రోజూ కూలీకి వెళ్లి జీవితాలను వెళ్లదీసేవారే. రోజంతా పనిచేసి ఇంటికి వచ్చి ప్రశాంతంగానిద్రపోదామంటే బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో యువకుల అరుపులు, కేకలు భంగం కలిగిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు నిల్.. ఆదాయం ఫుల్

ఈ బాక్స్ క్రికెట్ గ్రౌండ్ నిర్వాహకులకు మునిసిపాలిటీ నుంచి, జిల్లా స్పోర్ట్స్ శాఖ నుంచి, పోలీస్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని స్థానికులు తెలిపారు. ఈ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడడానికి గంటకు రూ.600ఫీజు వసూలు చేస్తున్నారు. ఇలా నిత్యం రూ.5వేల వరకు సంపాదిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కుడకుడలో ఇలాంటి బాక్స్ క్రికెట్ గ్రౌండ్ మరొకటి ఉంది. అయితే అక్కడ సాయంత్రం వరకు మాత్రమే ఆడుకోవడానికి నిబంధనలు ఉన్నాయి. సుందరయ్యనగర్‌లో ఉన్న బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో మాత్రం అర్ధరాత్రి దాటినా ఆటలు ఆడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మునిసిపల్ అధికారులు, పోలీసులు ఈ వైపు దృష్టి సారించడంలేదు. బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడే సమయంలో కొంత మంది యువకులు మద్యం తాగడంతో పాటు గంజాయి కూడా పీలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద పెద్ద శబ్దాలతో, అరుపులతో ఇంట్లో ఉండే పరిస్థితి కూడా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పోలీసులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సూర్యాపేటలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమి

భయాందోళనకు గురవుతున్నాం



బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు క్రికెట్ ఆడుతున్నందున ఇబ్బంది పడుతున్నాం. చాలా మంది మద్యం తాగి అరుపులు, కేకలు వేస్తున్నారు. దీనిపై మునిసిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

● సిరపంగి నాని, సుందరయ్యనగర్ కాలనీవాసి

వైభవంగా గణపతి రుద్ర హోమాలు



పూజలో పాల్గొన్న శివమాలధారులు

ఆత్మకూర్(ఎస్), మార్చి 5: శివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం శివమాలధారులు గణపతి హోమాలు, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి నగిరే పర్వతాలు, తంగెళ్ల వీరారెడ్డి, తండు శ్రీను, బొడ్డు మల్సూర్, ఉప్పల శ్రీశైలం, కోడూరు రామకృష్ణ, జలగం మల్లేష్, మొరిశెట్టి వెంకటేష్, నరేష్, శ్రీను, సందీప్ తదితరులు పాల్గొన్నారు

సంప్రదాయబద్ధంగా నృసింహుని నిత్య కల్యాణం

మఠంపల్లి, మార్చి 5: మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం నృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మీనృసింహుని కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


సేవాలాల్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి



తుంగతుర్తిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

తుంగతుర్తి, మార్చి 5: మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 10వ తేదీన నిర్వహించే సంత్ సేవాలాల్ 285వ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌నాయక్ కోరారు. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం తుంగతుర్తి కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గిరిజన సంఘం నాయకులతో కలిసి 'ఛలో తుంగతుర్తి' పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటానికి సేవాలాల్ ఎంతో సేవ చేశారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ మండల అధ్యక్షుడు అంబటి రాములు, ఆరాధ్య ఫౌండేషన్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు నాగునాయక్, జిల్లా అధ్యక్షుడు వెంకన్ననాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు సోమ్లానాయక్, జిల్లా నాయకులు ధారాసింగ్, వెంకన్న, కిషన్‌నాయక్, నూతనకల్ అధ్యక్షుడు శ్రీకాంత్, హేమనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 5: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వడపప్పు, పులిహోర, పానకం నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, హరీష్‌కుమారాచార్యులు, గండు సైదులు, కుచేలు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

చిలుకూరు, మార్చి 5: మండల కేంద్రంలో కవితా కళాశాల సమీపంలో నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయానికి మంగళవారం డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి వెంకటరమణ, రజిత దంపతులు రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ పీఠాధిపతి పమ్మీబ్రహ్మయ్యాచారి సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షుడు పిచ్చయ్యచారి, సభ్యులు ఉపేంద్రాచారి, పోతులూరాచారి, పరిపూర్ణాచారి, నాగబ్రహ్మచారి, శ్రీను, పవన్ పాల్గొన్నారు.

తేజ విద్యాలయాన్ని సందర్శించిన ఏపీ సభ్యులు



తేజ విద్యాలయాన్ని సందర్శించిన వీసీఎస్‌టీఏ సభ్యులు

కోదాడ రూరల్, మార్చి 5: మండలంలోని కొమరబండ తేజ విద్యాలయాన్ని ఏపీ రాష్ట్రం విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, టుటోరియల్స్ అసోసియేషన్ (వీసీఎస్అండ్‌టీఏ)కు చెందిన 39మంది కరస్పాండెంట్లు మంగళవారం సందర్శించారు. దేశవ్యాప్తంగా విద్యాబోధనలో వినూత్న విధానాలను అనుసరిస్తున్న 38పాఠశాలలను సెంటర్ ఫర్ ఇన్నోవేషన్స్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్ (సీఐపీఎస్) సంస్థ గతంలో ప్రకటించింది. ఆ జాబితాలో తేజ విద్యాలయానికి స్థానం దక్కడంతో, విజయవాడ పట్టణ పరిసరాలకు చెందిన 39పాఠశాలల యాజమాన్య సభ్యులు ఆర్టీసీ ప్రత్యేక బస్సులో తేజ విద్యాలయానికి వచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డితో మాట్లాడారు. గ్రంథాలయం, గణిత, తెలుగు ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు నిత్యం వార్తాపత్రికలు చదవడం, తాజా అంశాలపై ప్రతి వారం పరీక్షలు నిర్వహించడాన్ని ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్సంగ్ కార్యక్రమంలో పాల్గొని, పాఠశాలలో తోటను పరిశీలించారు. కార్యక్రమంలో వీసీఎస్‌టీఏ సెక్రటరీ చిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రెసిడెంట్ వెనిగళ్ల అమ్మాజి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేజ విద్యాలయ ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డిని వారు సన్మానించారు.

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

మునగాల రూరల్, మార్చి 5: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపుగ్రామీణాభివృద్ధి అధికారి బి.శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని నర్సింహులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో వననర్సరీ, స్వచ్ఛభారత్ మిషన్, మరుగుదొడ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి గతంలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పూర్తి వివరాల కోసం ప్రత్యేకంగా తనిఖీ చేస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శైలజ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ కల్యాణి, రాంబాబు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సింహులగూడెంలో గ్రామపంచాయతీ వననర్సరీని తనిఖీ చేస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శిరీష

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



దర్శించర్లలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నర్సయ్య

నేరేడుచర్ల, మార్చి 5: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నేరేడుచర్ల జడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామ పంచాయతీ పరిధిలో 'ఉపాధి' నిధులు రూ.25లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి, నాయకులు వెంకటసైదులు, మాగంటి జయమ్మ, జొన్నలగడ్డ చిన సైదులు, పడిగపాటి సైదిరెడ్డి, జలీల్, కర్నె సైదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కుర్రి శ్రీను, నన్నెపంగ శ్రీను, బుర్రి శ్రీను, అంకుష్, సునీల్ పాల్గొన్నారు.

10న సూర్యాపేటలో బహుజన మహాసభ

తుంగతుర్తి, మార్చి 5: జిల్లా కేంద్రంలోని పాత బస్‌స్టేషన్ వద్ద ఉన్న పబ్లిక్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 10వ తేదీన నిర్వహించే బహుజన రాష్ట్ర మొదటి మహాసభను విజయవంతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ మెంతబోయిన సింహాద్రి యాదవ్ కోరారు. మండలంలోని కరివిరాలకొత్తగూడెం గ్రామంలో దళిత బహుజన విప్లవోద్యమ నిర్మాత మారోజు వీరన్న స్థూపం వద్ద మహాసభలకు సంబంధించి కరపత్రాలను బహుజన మహాసభ రాష్ట్ర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు మంత్రి సీతక్క హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో బహుజన మహాసభ రాష్ట్ర నాయకులు నారబోయిన వెంకట్ యాదవ్, బుడిగె మల్లేష్, బత్తుల వెంకన్న, మాంద్ర మల్లయ్య, జిల్లా నాయకులు పగలగాని సాగర్, గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు సుదర్శన్, వర్దెల్లి రాము, తొట్ల శంకర్ పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

గరిడేపల్లి, మార్చి 5: మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామని ఎంపీటీసీ షేక్ మున్నీసాచాంద్‌మియా అన్నారు. మంగళవారం కీతవారిగూడెంలో మాట్లాడుతూ రెండేళ్లుగా వేసవిలో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై గత ప్రభుత్వంలో అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారంకాలేదన్నారు. ఈ సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే పరిష్కరించమని మిషన్ భగీరథ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కీతవారిగూడెంలో పర్యటించి అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు హక్కులను కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, మార్చి 5: మహిళలు తమ హక్కులు కాపాడుకోవాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని అరుణసఫలి భవన్‌లో జెండాను పానుగంటి పద్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల సాధన కోసం మహిళలు పోరాడాలన్నారు. మహిళలను జాగృతం చేయాలన్నారు. కార్యక్రమంలో చింతకుంట్ల విజయ, ఎల్లావుల ఉమ, బండి ప్రమీల, లలిత, పుష్ప, లక్ష్మి, కీర్తి, రేష్మ, లక్ష్మి, సుధ, నాగమణి, అనిత పార్వతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు

మఠంపల్లి, మార్చి 5: మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో మంగళవారం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, ధీరవత్ నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో భారీ నీటిపారుదల శాఖ, పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

'పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'

తిరుమలగిరి రూరల్, మార్చి 5: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. మంగళవారం మండలంలోని తొండ గ్రామంలో జరిగిన సీపీఎం మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు పదేళ్లుగా ప్రధాని మోదీ ఏమీచేయలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు కారుచౌకగా ఆదాని, అంబాని వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడంతో దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. మోదీ అనుసరించిన విధానాలతో సామాన్యుల జీవితాలు అతలాకుతలమయ్యాయని అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, 57 ఏళ్ల నిండిన రైతులందరికీ పింఛన్ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఉప్పలయ్య, కె.లింగయ్య, సత్యనారాయణరెడ్డి, అబ్రహం, సోమయ్య, యాకయ్య, వెంకటయ్య, వెంకన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మేళ్లచెర్వు, మార్చి 5: కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన జువారి సిమెంట్స్ పరిశ్రమకు చెందిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని, వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, కమిటీ సభ్యులు ముత్యాలు, జిల్లా కార్యదర్శి వట్టెపు సైదులు, శౌరి, శ్రీను, వెంకటేశ్వర్లు, సీతారాం పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌ను కాపాడాలి

హుజూర్‌నగర్, మార్చి 5: చిన్నారుల భవిష్యత్‌ను కాపాడాలని మండల వైద్యాధికారి పుష్పలత కోరారు. మంగళవారం మండలంలోని లింగగిరి గ్రామంలో సంచార జాతులు, ఇటుక బట్టీల వద్ద ఉన్న చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ టీం ద్వారా పల్స్‌పోలియోను నూరు శాతం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఇందిరాల రామకృష్ణ, పద్మ, నూర్జహాన్, గజకంటి ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యం

చిలుకూరు, మార్చి 5: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని డీపీఎంలు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో చిలుకూరు, హుజూర్‌నగర్ మండలాల వీవోఏలకు "లక్‌పతి దీదీ" కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా ఇచ్చే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా మహిళలను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో లక్‌పతి దీదీ ట్రైనర్ గుండాల సైదయ్య, ఏపీఎం రెమిడాల దుర్గాప్రసాద్, సీసీ స్వరూప, పరిమళ, కోటేశ్వరరావు, వీవోఏలు పాల్గొన్నారు.

డ్రైవింగ్ వృత్తిని భర్త వదలనందుకు ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ వివాహిత మృతి

అనంతగిరి, మార్చి 5: జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. అనంతగిరి ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ధర్మవరప్పాడుతండాకు చెందిన గుగులోతు అంజలి (రమ్య)కు అనంతగిరి మండలం పాలారంతండాకి చెందిన భూక్య రవితో 2015లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త రవి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. డ్రైవింగ్ వృత్తి అంటే ఇష్టంలేని అంజలి, డ్రైవింగ్ వృత్తిని వదిలేసి, మరో పనిని చేసుకోవాలని చాలాకాలంగా భర్తగా చెబుతోంది. భర్త వినకుండా డ్రైవర్‌గానే పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 11వ తేదీన భర్త డ్యూటీకి వెళ్లగా, జీవితంపై విరక్తి చెంది, క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. కుమార్తె మృతిపై ఎటువంటి అనుమానం లేదని తల్లి కౌసల్య పోలీసులకు దరఖాస్తు ఇచ్చింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ వ్యాన్ బోల్తా



బోల్తాపడిన మినీ వ్యాన్ నుంచి బియ్యాన్ని ట్రాక్టర్‌లోకి ఎగుమతి చేయిస్తున్న పోలీసులు

సూర్యాపేట క్రైం, మార్చి 5: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి.రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి మినీవ్యాన్‌లో 60బస్తాల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా, సూర్యాపేటలోని ఎన్టీఆర్ పార్కు సమీపానికి రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటనలో మినీ వ్యాన్ డ్రైవర్ సంజీవకు స్వల్పగాయాలయ్యాయి. వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్‌బియ్యం బస్తాలు రోడ్డుపై పడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాన్ని, రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. కోదాడ నుంచి హైదరాబాద్‌కు బియ్యాన్ని ఎవరు తరలిస్తున్నారు? రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌లో కొనుగోలు చేసేది ఎవరు? అనే విషయాలు దర్యాప్తులో తేలనున్నాయని సీఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి, మార్చి 5: మండలంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఏఎస్ఐ జి.నికోలస్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం బిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు.

చెరువుల వేలానికి స్పందన కరువు

● 96కు మూడు చెరువులకే పూర్తయిన వేలం

భానుపురి, మార్చి 5: జిల్లా కేంద్రంలోని మత్స్య కార్యాలయంలో ఫిబ్రవరి 27 నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు మత్స్య సహకార సంఘం ఆధీనంలో లేని చెరువులు, కుంటల్లో చేపలను పట్టుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తే స్పందన కరువైంది. 96చెరువులకు వేలం నిర్వహించగా, మూడు చెరువులకే వేలం పూర్తయిందని జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ తెలిపారు. ప్రభుత్వం పాట ఎక్కువగా ఉందని, వేలంలో కాంట్రాక్టర్లు పాల్గొనలేదని ఆయన తెలిపారు. దాసాయిగూడెంలోని దాసాయిచెరువును రూ.10లక్షలు, తిర్మలగిరిలోని ఊర చెరువును రూ.2.30లక్షలు, గుంపులలోని చెరువును రూ.40వేలకు కాంట్రాక్టర్లు కైవసం చేసుకున్నారన్నారు. మరో 93చెరువుల వేలం పాటకు కాంట్రాక్టర్లు హాజరుకాలేదన్నారు. ఈ నివేదికను కలెక్టర్ అందజేస్తామని రూపేందర్‌సింగ్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు నిరసనగా ధర్నా నేడు

కోదాడ, మార్చి 5: ఎల్ఆర్ఎస్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి రూ.20వేల కోట్లు దోచుకోవడానికి ప్రణాళిక రూపొందించిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌కు నిరసనగా పట్టణంలో బుధవారం ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'సీసీ కెమెరాలు అమర్చడం అవమానించడమే'

గరిడేపల్లి, మార్చి 5: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అంగన్‌వాడీ కార్యకర్తలను, సిబ్బందిని అవమానించడమేనని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయడం లేదని, నెలకు సరిపడా సరుకులు ఇవ్వడం లేదని, నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయడంలేదని, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, చీపుర్లు కూడా లేవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన పౌష్టికాహారం అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, వి.ఆంజనేయులు, తిరపయ్య పాల్గొన్నారు.

టీడీపీ తెలంగాణ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా వాసు

మోతె, మార్చి 5: హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ తెలంగాణ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా మోతె మండలం నాగయ్యగూడేనికి చెందిన కోడె వాసుబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పార్టీనో బలోపేతం చేస్తానన్నారు. కోదాడ నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తానన్నారు.

విద్యార్థుల దాహార్తి తీర్చాలి: ఎంఈవో

హుజూర్‌నగర్, మార్చి 5: వేసవిలో విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో సైదానాయక్ అన్నారు. మంగళవారం ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 50ప్రభుత్వ పాఠశాలలకు తాగునీరు నిల్వచేసే రూ.20వేల విలువైన వాటర్ క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సులువ శ్రీనివాస్, చందు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, అంజయ్య, వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, షర్మిల, సైదులు, నర్సింహారావు, నాగేశ్వరరావు, బాబు, వంశీ పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, మార్చి 5: భారతీయ హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని బ్రహ్మకుమారిలు శైలజ, లక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రశాంతమైన జీవితానికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతూ భారతీయ సంస్కృతీసంప్రదాయాలను గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, మునిసిపల్ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి, నాలుగో వార్డు కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు, అనిల్, రాధిక, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, నాగమణి, సరిత, మాల్యాద్రి పాల్గొన్నారు.



భానుపురి: జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు ట్విటర్ వేదికగా ఫిర్యాదుచేయవచ్చని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ పాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు twitter(X)@SE-OP-SURYAPETకు ఫిర్యాదులు పంపవచ్చని అన్నారు.

కోదాడ: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. తీర్థప్రసాదాల వితరణ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంజయ్య, తిరుపతయ్య, హనుమంతరావు, కృష్ణమూర్తి, సత్యం, చారి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

పాలకవీడు: మండలంలోని యల్లాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నెమ్మాది సుజాత కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బ్లాక్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు తీగల శేషిరెడ్డి 10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సుందరయ్య, చిట్టిబాబు, మహేష్, సైదులు, ప్రతాప్, వంశీ, బన్నీ పాల్గొన్నారు.

తిరుమలగిరి: పీఎం విశ్వకర్మ యోజనకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని విశ్వకర్మ యోజన కోఆర్డినేటర్ దీన్‌దయాల్ తెలిపారు. ఈ పథకానికి తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 2400 మంది నమోదు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకోని కులవృత్తుల వారు నమోదుచేసుకోవడానికి మండలాల వారీగా అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు.

● వ్యవసాయ మార్కెట్లలో దళారుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. తిరుమలగిరిలో ఆయన మాట్లాడుతూ దళారీల దోపిడిని అరికట్టాలని ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్‌లో ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.